# ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్ పరీక్ష



**రామగిరి మే 17 సూర్య న్యూస్:–** రామగిరి మండలం సేంటినరీ కాలనీలోని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జెఇఇ అడ్వాన్సు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షకు 96 మంది విద్యార్థులకు గాను 95 మంది హజరైనారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 96 మందికి ఇద్దరు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ తెలిపారు. ఐఐటి హైద్రాబాద్ కు చెందిన ముగ్గురు పరిశీలకు నిర్వహణలో పరీక్ష జరిగింది. ఫ్లయింగ్ స్క్వాడ్ సైతం పరీక్షా కేంద్రాని తనిఖీ నిర్వహించారు. మంథని సిఐ బొల్లపల్లి రాజు గౌడ్, రామగిరి ఎస్ఐ తాడవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహణలో పరీక్ష ప్రశాంతగా జరిగింది.

# మానవీయ వృద్ధా శ్రమంలో జన్మదిన వేడుకలు

### వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నవ దంపతులు



**అశ్వాపురం మే 17 సూర్య న్యూస్:–** మండల పరిధిలోని సీతారామపురం మానవీయ వృద్ధా శ్రమంలో ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన కొడారి వెంకటేశ్వర్లు, రమాదేవిల కుమారుడు మురళీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు . తొలుత ఆశ్రమంలోని వృద్ధుల నడుమ కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. ఈ సందర్భంగా వారు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆశ్రమంలోని వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 9వ తేదీన తన కుమారుడి వివాహం జరిగిందని, ఈ శుభకార్యం జరిగిన తర్వాత తొలుత వచ్చిన పుట్టినరోజు కావడంతో ఆశ్రమంలోని వృద్ధుల నడుమ వేడుకలు జరుపుకోవాలన్న ఆకాంక్షతో ఇక్కడ పుట్టిన రోజు జరుపుకున్నట్లు తెలిపారు. ఈ పుట్టినరోజు వేడుకల కార్యక్రమంలో కొడారి లక్ష్మీ ప్రసన్న, కొడారి అంకిత, పూస రమేష్, గద్దల రాము, సరిత, ప్రతాప్, ఆశ్రమ నిర్వాహకులు దైదా నారాయణరెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# సెక్రెటేరియట్ సహాయ కార్యదర్శి తీరందాసు యాదగిరికి ఘన సన్మానం



**రామగిరి మే 17 సూర్యా న్యూస్:–** తెలంగాణ సెక్రెటేరియట్ లో సహాయ కార్యదర్శిగా పనిచేసి ఏప్రిల్ 30 న పదవి విరమణ పొందిన తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీరందాసు యాదగిరిని అల్కాపురిలోని టిపియూఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా సంఘం పక్షాన యాదగిరికి శాలువాకప్పి,మార్కండేయ స్వామి ఫోటోను జ్ఞాపికగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ యాదగిరి సెక్రెటేరియట్‌లో ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సెక్రటరీగా సేవలందించి, ఉద్యోగ సంఘం బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు కొలిపాక సారయ్య, రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ దుబాసి విష్ణుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాయం చొరవతో ముత్యాలమ్మ గుడి వద్ద బోరు

### బోరుకు భూమి పూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు నాయకులు

**అశ్వాపురం మే 17 సూర్య న్యూస్:–** మండల పరిధిలోని సంధ్రలబోడు గ్రామంలో ముత్యాలమ్మ గుడి వద్ద పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని హ్యాండ్ బోరు మంజూరు చేపించారు. ముత్యాలమ్మ గుడి వద్ద ఈ నెల 22 వ తేదీ జాతర సందర్భంగా మంచినీటి అవసరం విషయంలో సంద్రలబోడు ప్రజల తరపున స్థానిక సర్పంచ్ తెల్లం నాగమణి విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎమ్మెల్యే బోరు మంజూరు చేయడమే కాకుండా అధికారులతో మాట్లాడి తక్షణమే బోరు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించగా అధికారులు స్పందించి సర్పంచ్ తెల్లం నాగమణి చేత భూమిపూజ చేయించి బోరు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పాయంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, సర్పంచ్ లు ఏనిక ఉషారాణి, సబ్కా పిచ్చయ్య నాయకులు తెల్లం వీరభద్రం, తెల్లం వెంకటేశ్వర్లు, తెల్లం నాగరాజు, కోంద్రు రామారావు, తెల్లం బాబు, తుర్రం వెంకటేశ్వర్లు, ఊకే నీలం రాజు, కోంద్రు రాజారావు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం





### వైభవంగా జరిగిన శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవం

### ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుదీరిన గోపృష్ట దర్శనం

### శ్రీ స్వామివారి మహా అన్న ప్రసాదాన్ని స్వీకరించిన 5000 మంది భక్తులు

### స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని చూసి ఆనంద పరవశులయిన భక్తులు

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే17 సూర్యా న్యూస్**

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఆదివారం 5000 మంది భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణ లతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.




# ఓసిపి 2లో అధికారుల నిర్లక్ష్యం



### కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా -ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మోలుమూరు శ్రీనివాస్

**రామగిరి మే 17 సూర్య న్యూస్:–** సింగరేణి సంస్థ ఆర్జి 3 పరిధి ఓసిపి2లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృధాగా మారిందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్ ఆరోపించారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీపీ 2లో అత్యాధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన క్రషర్స్‌ను సంబంధిత అధికారులు ఓబి మట్టితో కప్పి వేయాలని చూస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కోల్ ఇండియాలోనే నెంబర్ వన్ టెక్నాలజీతో ఉన్న ఈ క్రషర్స్‌ను సక్రమంగా వినియోగించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల కంపెనీకి కోట్ల రూపాయల నష్టం కలుగుతోందన్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదు, ఇది ప్రజా సంపదను నాశనం చేసే చర్యగా పరిగణించాలన్నారు. సింగరేణి సంస్థ నిబంధనల ప్రకారం సంస్థ ఆస్తులను రక్షించడం ప్రతి అధికారికి బాధ్యత. అయితే ప్రస్తుతం కొంతమంది అధికారులు తమ బాధ్యతలను విస్మరించి ఇలాంటి విలువైన యంత్రాలను స్క్రాప్ దశకు తీసుకెళ్లేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇది సింగరేణి చట్టపరమైన విధానాలకు వ్యతిరేకం. ఈ పరిణామాలపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ భవిష్యత్తు, వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓసీపీ 2లోని క్రషర్స్‌ను ఓబి మట్టితో కప్పాలని చూస్తున్న అధికారులపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై సింగరేణి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో కంపెనీకి జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధ్యుల నుంచి రికవరీ చేయడంతోపాటు యంత్రాన్ని పునరుద్ధరించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సంబంధిత అధికారులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకొని పక్షంలో కార్మిక సంఘాలతో కలిసి భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా ధనం కాపాడాలి, సింగరేణిని రక్షించాలని ఆయన అన్నారు.



# ఏకగ్రీవంగా గోప తండ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

**సిరోల్ మే 17 సూర్య న్యూస్ :–**సిరోల్ మండలం లోని గోప తండలో కాంగ్రెస్ నూతన కమిటీ, యూత్ కమిటీ, మహిళా కమిటీ, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దరావత్ బిచ్చు, ఉపాధ్యక్షులుగా గూగులోతు హుస్సేన్, గూగులోతు శంకర్, మహిళా కమిటీ అధ్యక్షురాలుగా గూగులోతు బీచలీ, రైతు కమిటీ అధ్యక్షులుగా గూగులోతు లింగా, యూత్ అధ్యక్షులుగా దరావత్ శ్రీను నియమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో విద్యా వారోత్సవం

**కామారెడ్డి జిల్లా బ్యూరో మే 17 సూర్య న్యూస్ :–** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవంలో భాగంగా కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ మోడల స్కూల్ కొత్తబాద్ బాన్సువాడ విద్యార్థినులు కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ ద్వితీయ ర్యాంకర్ హజారే శ్రావణి, తృతీయ ర్యాంకర్ కేతావత్ అశ్వితలకు ప్రతిభా పురస్కారంగా ఒక్కొక్కరికి రూ.10,000 నగదు బహుమతిని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందించిన డీఈఓ రాజు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కమల్ కిషోర్, ప్రిన్సిపాల్ టీ జి ఎం ఎస్ కొత్తబాద్ బాన్సువాడ పాల్గొన్నారు.



